www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 4 ఏప్రిల్ 2024
5
అన్నమయ్య



లోకేష్‌ను కలిసిన 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబును రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు కలిశారు. ఉండవల్లిలోని లోకేష్ నివాసంలో కలిసినట్లు రాజు తెలిపారు. రాజంపేట పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు చెప్పారు. రాజంపేట అసెంబ్లీ స్థానంతో పాటు పార్లమెంటు పరిధిలోని అన్ని స్థానాలలోను గెలుపు కోసం ప్రత్యేక దృష్టి సాధించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ పరిధిలో ఉన్న టిడిపి నాయకులు అందరినీ కలుపుకుని అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని తెలిపారు.



లోకేష్‌తో జగన్‌మోహన్‌రాజు

జమకాని నిధులు.. పింఛనుదారుల పడిగాపులు



పీలేరు : సచివాలయం వద్ద పింఛను కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

- ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షణ
- సచివాలయ ఖాతాలకు జమకాని నిధులు
- అరకొర నిధులతో ఆరు గంటలకు మొదలైన పంపిణీ
- నిధుల కోసం బ్యాంకుల్లో నిరీక్షించిన సంక్షేమ అధికారులు
- ఎండవేడిమికి అల్లాడిన పింఛనుదారులు

ప్రజాశక్తి-పీలేరు

సామాజిక పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరిమహిళలు సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పింఛను కోసం వేచి చూశారు. సాయంత్రం ఐదు గంటల వరకు కూడా అధికారులు పంపిణీ చేయకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. అధికారులు స్థానిక సచివాలయాల వద్ద పింఛనుదారులకు కనీస సౌకర్యాలైన షామియానా, కుర్చీలు, తాగునీటి సౌకర్యం కల్పించారు. మధ్యాహ్నం వరకు కూడా పింఛను డబ్బులు పంపిణీ చేయకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయాల బ్యాంక్ ఖాతాలో పింఛను నిధులు జామకాకుండా పోవడంతో సచివాలయాల కార్యదర్శులు, సంక్షేమ అధికారులు తమకు కేటాయించిన బ్యాంకుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిరీక్షించక తప్పలేదు. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి సచివాలయాల ఖాతాలకు జమైన ఆరకొర నిధులతో సిబ్బంది ఆరు గంటల నుంచి అందిన నిధులను పెన్షన్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పీలేరు మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 9927 మంది సామాజిక పింఛనుదారులు ఉన్నారు. వీరందరి కోసం రూ.2,90,92,000 నిధులు అవసరమున్నాయి. పీలేరు మండల పరిధిలోని 16 సచివాలయాల్లో ఒక్కో సచివాలయానికి రూ.9,31,500 నుంచి రూ.31,92,500 వరకు నిధులు అవసరం ఉన్నాయి. అయితే బుధవారం సాయంత్రం వరకు కూడా ప్రభుత్వం నుంచి సచివాలయాల ఖాతాలకు కేవలం రూ.90 వేలు మొదలు రూ.9 లక్షల వరకు మాత్రమే నిధులు జమయ్యాయి. లబ్ధిదారుల పంపిణీ కోసం తగినన్ని నిధులు అందకపోవడంతో సచివాలయ ఉద్యోగులు తమ పై అధికారుల సూచనలు, సలహాలు, ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులు ఒకరి నుంచి ఒకరు నిధులు సర్దుకుంటూ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందరేగా ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు, వీధి, విధానాలను అనుసరించి అందిన పెన్షన్ల నిధులను పంపిణీ చేయడానికి సచివాలయ ఉద్యోగులకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. అందుతున్న నిధులతో సచివాలయాల ద్వారా పంపిణీ కార్యక్రమం మొదలు పెట్టారు. **నిమ్మనపల్లి :** పింఛనుదారులకు పింఛను పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం సచివాలయ కేంద్రంలోని ఉద్యోగుల ద్వారా మధ్యాహ్నం నుంచి చేపట్టినట్లు ఎంపిడిఒ షాలెట్ తెలిపారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగుల చేత నిర్వహిస్తున్నట్లు వివరించారు. గతంలో వాలంటీర్లు నేరుగా పింఛన్లను పింఛనుదారుల ఇంటి వద్దనే అందించే వారిని, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా వారిని ఎన్నికల కమిషన్ పక్కన పెట్టిందని తెలిపారు. మండలంలో 5 వేలకు పైగా వివిధ రకాల పింఛనుదారులు ఉన్నారని, వారందరికీ ఈనెల 6వ తేదీ వరకు పింఛను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మంచానికే పరిమితమై ఉన్నవారు, నడవలేని వారికి సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకే వచ్చి పింఛను అందిస్తారని తెలిపారు. సచివాలయ కేంద్రాల వద్ద పింఛనుదారుల కోసం షామియానాలు, కుర్చీలు, త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



నిమ్మనపల్లె : పింఛనుదారుల కోసం నిరీక్షిస్తున్న అధికారులు

ఎపిఎండిసి అసిస్టెంట్ మేనేజర్‌ను సస్పెండ్ చేయాలి : 'సిటు'

ప్రజాశక్తి-ఓబులవారిపల్లె

ఎపిఎండిసి సంస్థ మంగంపేట బ్రాంచ్‌లో అసిస్టెంట్ మేనేజర్ హెచ్ఆర్‌డిగా విధులు నిర్వర్తిస్తున్న నారాయణరెడ్డి అవినీతి పరాకాష్టకు చేరిందని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వీస్ రిజిష్టర్‌లో సంతకాలు పెట్టకుండా అసిస్టెంట్ మేనేజర్ హెచ్ఆర్‌డి సంబంధించిన వ్యక్తులు సెలవు కాగితం పెట్టినా సర్వీస్ రిజిష్టర్‌లో నమోదు చేయ లేదన్నారు. నెల అటెండెన్స్ పూర్తిగా వేయటం వలన ఆ ఉద్యోగులు సరిగ్గా విధులకు హాజరు కాకుండా ఎప్పుడూ సెలవులపైన ఉంటున్నారని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఒ సర్వీస్ రిజిష్టర్ పరిశీ లించగా ఆయన కొన్ని సంవత్సరాలుగా సంతకాలు పెట్టలేదని తెలిసిందన్నారు. ఈ విష యాన్ని సిపిఒను అడగగా సంతకాలు పెట్టలేదనేది వాస్తవమేనని తెలిపారని చెప్పారు. దీనిపైన విచారణ చేసి బయోమెట్రిక్ ఫింగర్ ప్రింట్స్, సెక్షన్ అలాట్మెంట్, జీతముల హాజరు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ బిల్లులు చూసుకోమని ఆయనకు బాధ్యతలు అప్పగిస్తే ఆయన సతీమణికి ఆస్పత్రిలో చూపించకుండా బిల్లులు మంజూరు చేసుకున్నారని ఆరోపించారు. మరి కొంత మంది కార్మికులకు ఆశ చూపించి వారి కార్డు లను ఇప్పించుకుని లక్షల్లో మెడికల్ ఇన్సూరెన్స్ ద్వారా వసూలు చేశారని, వీటన్నింటికి ఆధారాలు ఉన్నాయని అన్నారు. మంగంపేట బ్రాంచ్‌లో టెం డర్లు వేస్తే అతనికి ముందుగానే తెలుస్తుందని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని అతని బినామీలను రప్పించి టెండర్లు వేయిస్తూ అధికార దుర్వియోగానికి పాల్పడుతున్నారు తెలిపారు. మహిళా ఉద్యోగి మెటర్నిటీ సెలవు విషయంలో ఆమెకు సుమారు మూడు నెలలు జీతం రావలసి ఉన్నా రాకుండా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఈయనను సస్పెండ్ చేసి పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు లేని యెడల కార్మికులు, కార్మిక సంఘాలను కలుపుకుని జిల్లా వ్యాప్తంగా ఎపిఎండిసి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామనిహెచ్చరించారు.

'అన్నమాచార్య'లో సిజిఆర్ టాలెంట్ మీట్ ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సిజిఆర్ (చైతన్య జ్ఞాన రత్న) టాలెంట్ మీట్-2024 ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల, యోగివేమన యూనివర్సిటీ డాక్టర్ బి.జయరామిరెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కాలాన్ని వృథా చేయకుండా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యను అభ్యసిస్తూ ముందుకు సాగితే సాధించలేనిది ఏదీ లేదని తెలిపారు. 90 శాతం మంది విద్యార్థులు కాలాన్ని వృథా చేస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రతి విద్యార్థి ఆధునిక సాంకేతికతతో ఆవిష్కరణలు చేస్తూ నవశకానికి నాంది పలకవచ్చన్నారు. అనంతరం కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఆన్‌లైన్‌లో రెండు లక్షలకుపైగా పుస్తకాలు ఉన్నాయని, ఆఫ్‌లైన్‌లో యాభై వేలు పుస్తకాలు దొరుకుతున్నాయని, వీటిని సమగ్రంగా వినియోగించుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రోజురోజుకు కొత్తకొత్త ఆలోచనలతో విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ప్రతి ఏడాది టాలెంట్ మీట్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఇలాంటి టాలెంట్ మీట్‌లను సక్రమంగా సద్వినియోగం చేసుకొని వారి ప్రతిభను గుర్తించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ మాట్లాడుతూ బుధవారం, గురువారం సిజిఆర్ టాలెంట్ మీట్‌ను అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా బుధవారం సివిల్, మెకానికల్, ఇసిఇ, ఇఇఇ విభాగాలనందు పేపర్ ప్రజెంటేషన్స్, కల్చరల్ ఈవెంట్స్ ఉంటాయని, గురువారం సిఎస్ఇ, ఎఐడిఎస్, ఎఐఎంఎల్, ఎంసిఎ, ఎంబిఎ విభాగాలకు చెందిన ప్రజెంటేషన్స్ గురువారం ఉంటుందని తెలిపారు. డీన్ డాక్టర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ అనితర మేధో సంపత్తికి అద్వితీయ సృజన తోడైతే కళ్ళ ముందు అద్భుతాలు విస్తృతమవుతాయన్నారు. సృష్టికి ప్రతి సృష్టి లాంటి ఆవిష్కరణలతో ఇంకో నవశకాన్ని నిర్మించే అపర విశ్వకర్మలు సివిల్ ఇంజినీర్లని చెప్పుకొచ్చారు. మంత్రాలు, తంత్రాలు ఉన్న రోజుల్లోనే యంత్రాలను కనిపెట్టి మానవ మనుగడకు పునాది అయ్యి బ్రతుకు బండిని ముందుకు నడిపిస్తున్నది మెకానికల్ ఇంజినీర్లని తెలిపారు. చిమ్మ చీకట్లో, కిరోసిన్ బుడ్డి వెలుతురులో దయనీయంగా ఉన్న మానవ జీవన విధానానికి రాత్రివేళ మరో సర్క్యూట్ సృష్టించి, భగభగ మండే ఎండలో సైతం చల్లని ఏసీ చలితో చరించేలా చేసిన ఎలక్ట్రికల్ ఇంజనీర్లు ఉన్నారని తెలిపారు. తరతరాల అంతరాలను తరంగాల ద్వారా ఛేదించి అంతర్జాలంలో మాయాజాలాన్ని సృష్టిస్తున్న ఆధునిక బ్రహ్మలైన ఎలక్ట్రానిక్ ఇంజినీర్లకు స్వాగతం సుస్వాగతం అంటూ తనదైన శైలిలో ప్రసంగించి విద్యార్థులను ఆకట్టుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో పలువురు హెచ్ఒడిలు ప్రసంగించారు. చివరగా ముఖ్య అతిథి అయినటువంటి ప్రొఫెసర్ జయరాంరెడ్డిని కళాశాల వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఒడిలు డాక్టర్ టి.నరేష్ కుమార్, సివిల్ డిపార్టుమెంట్, డాక్టర్ సి.హెచ్ నాగరాజు, ఇసిఇ, డాక్టర్ ఎ.హేమంత్ కుమార్, ఇఇఇ డిపార్టుమెంట్ కన్వీనర్ డాక్టర్ ఒ.హేమకేశవులతోపాటు మెకానికల్, సివిల్, ఇసిఇ బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చొప్పా గంగిరెడ్డి

హామీల అమలులో సిఎం జగన్ విఫలం : బిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ అన్నారు. బుధవారం బిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లికి గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా మదనపల్లిలో ఎన్నికల సభను ముందుగా నిర్వహించడం ద్వారా భవిష్యత్తులో అనేక అభివృద్ధి హామీలు వరాల జల్లు కురిపిస్తాడనుకున్న ప్రజలపై నీళ్ల జల్లి అరుంధతి సినిమా చూపించి వెళ్లిపోయారని విమర్శించారు. మదనపల్లికి జిల్లా రాకుండా మోసం చేసిన పార్టీ వైసిపి అని, బిటి కళాశాల యూనివర్సిటీ చేసామని చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించింది అదే పార్టీనన్నారు. ఇక్కడ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగకుండా కనీసం పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా ఉన్నతమైనటువంటి ఏ సౌకర్యాలు లేకుండా చేసినటువంటి పార్టీ వైసిపి అని గుర్తు చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి కూడా మాట్లాడిన మాటల్లో నిజాలు లేవని, ఆయన చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలేనని తెలిపారు. గాలేరు నగరి స్రవంతి గానీ, హంద్రీనీవా గానీ ఆయన చెప్పిన అనేక ప్రాజెక్టులు ఒక్క పని కూడా ఎక్కడా జరగడంలేదని పేర్కొన్నారు. వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయని విమర్శించారు. బిఎస్‌పి ప్రజా సంక్షేమ కోసం మదనపల్లి అభివృద్ధి కోసం పనిచేస్తున్నది చెప్పారు. ఖచ్చితంగా ప్రజలందరూ బహుజన సమాజ్ పార్టీని ఏనుగు గుర్తును ఆదరించాలని పిలుపునిచ్చారు.



విద్యార్థులకు సర్టిఫికేట్లను అందజేస్తున్న విజయభాస్కర్‌రావు

సైన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లి

సైన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకుంటే వారి ప్రగతికి సోపానాలు అవుతాయని ఎస్వీ యూనివర్శిటి ప్రొఫెసర్లు విజయభాస్కరరావు, దేవప్రసాదరాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన ఇండియన్ సైన్స్ అకాడమి అవగాహన సదస్సులు ముగిసాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే సైన్స్‌పట్ల ఆసక్తి కనపరుస్తూ చిన్న చిన్న ప్రయోగాలు చేస్తూ మంచి విజయాలు సాధించవచ్చన్నారు. యుజిసి సభ్యుడు ప్రొఫెసర్ జయశంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మూడు రోజుల వర్క్ షాప్‌లో పాల్గొని అవగాహన పెంచుకున్న విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆర్.గురు ప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ రాఘవేంద్ర, కో-ఆర్డినేటర్ రామాంజులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన జగన్

ప్రజాశక్తి-రాయచోటి

ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగ యువతను దారుణంగా మోసం చేశారని, యువత వైసిపి ప్రభుత్వాన్ని ఓడించాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ ఫ్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు వారి కాలంలో డిఎస్‌సి నోటిఫికేషన్‌లు విడుదల చేశారని తెలిపారు. డిఎస్‌సి నిర్వహించని ప్రభుత్వం ఒకే ఒకటి జగన్మోహనరెడ్డి ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలో 20 వేలకు పైగా ఉన్నా టీచర్ ఉద్యోగాలు ఉంటే 6500 మాత్రమే నోటిఫికేషన్‌లో చూపారని చెప్పారు. ప్రధానమైన నోటిఫికేషన్‌లు అన్ని ఎన్నికలకు చివరి మూడు నెలల కాలంలో ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేశారని పేర్కొన్నారు. యూనివర్సిటీ, ట్రిపుల్‌ఐటి, జెఎల్, డిఎల్ ఇలా వేర్వేరు ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు విడుదల చేసిన ప్రభుత్వం వాటికి భారీగా ఫీజులు పెట్టి రూ.కొట్లాది నిరుద్యోగుల నుండి వసూలు చేసిందన్నారు. ఈ నోటిఫికేషన్‌లు అన్ని ఫీజుల డబ్బుల కోసం అని నిర్ధారణ అయిందన్నారు. పాదయాత్ర సమయంలో జగన్ ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ కేలెండరు అన్నారన్నారు. ఒక్కటి లేదని, జిఒ నెంబర్ 77 తెచ్చి,పేద మధ్య తరగతి విద్యార్థులకు పీజీ, ఎంబిఎ, ఎంసిఎ, ఎంటెక్ ఇలా ఉన్నత చదువులకు దూరం చేసాడని ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విద్యార్థులకు, కాలేజీలకు సక్రమంగా ఇవ్వక ఇబ్బంది పెట్టారని పేర్కొన్నారు. అమ్మఒడి ఇద్దరు పిల్లలుంటే ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున అన్నాడరని, చివరకు ఒకరికే ఇచ్చి అది కూడా 13 వేలకు తగ్గించి ఈ విద్యా సంవత్సరం ఇవ్వలేదని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను, విద్యార్థులను తీవ్రంగా మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి జి.శ్రీనాథ్ యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శి గణేష్, పట్టణ నాయకులు విగ్నేష్ పాల్గొన్నారు.



రాంప్రసాద్‌రెడ్డి, ప్రసాద్‌బాబును సన్మానిస్తున్న నాయకులు

టిడిపికి పూర్వ వైభవం తీసుకొస్తాం

- మండిపల్లి, సుగవాసి

ప్రజాశక్తి-రాయచోటి

నియోజకవర్గంలో టిడిపికి పూర్వవైభవం తీసుకువచ్చి చరిత్రను తిరగరాస్తామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. బుధవారం ఇరువురు కలిసి పట్టణంలోని 1, 2, 3, 4వ వార్డులలో ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ వైసిపి పాలనపై ప్రజలు విసిగి పోయారని, అరాచక పాలనకు చరమగీతం పాడే రోజు దగ్గరలోనే ఉందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాయచోటి ఎమ్మెలే అభ్యర్థిగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని, కూటమి రాజంపేట ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎల్లప్పుడూ ప్రజల మధ్యలో ఉంటూ ప్రజలతో కలిసి వారి సమస్యలకు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ మూల్యాంకనం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారంతో ముగిసిందని ఆర్ఐఒ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు కేటాయించిన 1,84,907 జవాబు పత్రాల మూల్యాంకనం జిల్లా అధికారులు, ప్రిన్సిపల్, జూనియర్ అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది సహకారంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా ముగించాని తెలిపారు.



నియామక పత్రం అందజేస్తున్న విసి సుధాకర్

వైవీయూ డీన్‌గా ఆచార్య సుబ్బరాయుడు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్, లా అండ్ మేనేజ్‌మెంట్ డీన్‌గా ఎంబిఎ ఆచార్యులు వై,సుబ్బరాయుడును నియమిస్తూ విసి ఆచార్య చింతా సుధాకర్ నియామక పత్రాన్ని తన చాంబర్లో అందజేశారు. ఇదివరకు డీన్‌గా ఈ స్థానంలో పనిచేసిన ఆచార్య టి.శ్రీనివాస్ పదవీకాలం పూర్తవడంతో ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. నూతన డీన్‌గా నియమితులైన సుబ్బరాయుడు మూడేళ్ల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. అకడమిక్, పరిశోధనలపరంగా ఆయా విభాగాల అభివద్ధికి కషి చేయాలని విసి సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైవీయూ ఎడెక్స్ కోర్సులో నమోదుకు స్పందన

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వ విద్యాలయములోని ఎడెక్స్ అందించే కోర్సులలో నమోదు కేంద్రాన్ని(లైసెన్స్ యాక్టీవేషన్ అండ్ కోర్సెస్ ఎన్రోల్మెంట్ హెల్పిన్ సెంటర్) బుధవారం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి సందర్శించారు. ఈ కోర్సుల్లో 400 మంది ఫ్యాకల్టీ విద్యార్థులు వారి పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ కోర్సులో చేరడం ద్వారా ప్రపంచములో ప్రముఖ యూనివర్సిటీల ఫ్యాకల్టీ లెక్చర్ వీడియోస్ చూడడంతో పాటు మెటీరియల్స్‌ను విద్యార్థులు ఉచితంగా పొంది వాటిని సాధన చేయాలని ప్రిన్సిపల్ చెప్పారు. తద్వారా ప్రపంచ స్థాయి జ్ఞానాన్ని పొందవచ్చని తెలిపారు. ఏడెక్స్ ప్రోగ్రాం కోర్స్ ఛాంపియన్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.రెడ్డయ్య, కోర్సులో చేరిన విద్యార్థులను అభినందించారు.

'మిట్స్'లో జాతీయ స్థాయి సింపోజియం

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో టెక్నికల్ సింపోజియంను ఏర్పాటు చేసి నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల పూర్వ విద్యార్థి, బెంగుళూరులోని క్లారివాటే అనలిటిక్స్ కో-ఫౌండర్, ఎజిఎం రాఘవేంద్ర పాల్గొన్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడింగ్‌పై విద్యార్థులు అవగాహన పెంచు కోవాలని అన్నారు. ప్రోగ్రామింగ్ భాషలో ముఖ్యమైన కోడింగ్ పై పట్టు ఉంటే ఎలాంటి సమస్యనైనా సులువుగా పరిష్కరించవచ్చని అన్నారు. ప్రోగ్రామింగ్ భాషలు మనకు ఎన్ని ఉన్న ఒక సమస్య లాజిక్ చాలా ముఖ్యమని పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ విద్యా ర్థులకు కోడింగ్ నేర్చు కోవడం చాలా అవసరమన్నారు. కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని, ప్రోగ్రా మింగ్‌పై దృష్టి సాధించాలని అన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ కల్పనా, డీన్ కంప్యూ టర్ సైన్స్ గౌతమ్ చక్రబర్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి రాఘవేంద్ర



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న సినీనటి స్పందన

'ఎంజెఆర్'లో ఘనంగా జెనిత్ 2కె24

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులోని ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో జెనిత్ 2కె 24 నేషనల్ స్టూడెంట్స్ టెక్నికల్ సింపోజియం ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం స్థానిక చిత్తూరు రోడ్డులోని కళాశాల ఆవరణంలో ఈ కార్యక్రమాన్ని జరిపారు. కార్యక్రమంలో వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 128 విద్యార్థులు హాజరయ్యారు. వారికి పేపర్, పోస్టర్ ప్రజెం టేషన్, టెక్నికల్, క్విజ్ పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను కళాశాల చైర్మన్ ఎంపి అవినాష్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఎన్. సుధా కర్‌రెడ్డి బహుకరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రద ర్శించారు. ఈ కార్యక్రమానికి హీరోయిన్ స్పందన పల్లి, కామెడియన్ రవికిషోర్, జబర్దస్త్ నటులు ముక్కు అవినాష్, తాగుబోతు రాజమౌళి హాస్య బృందం హాస్యవల్లరి కార్యక్రమాలను ప్రదర్శించి విద్యా ర్థులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎంపి.అవినాష్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి, కళాశాలలోని వివిధ విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మేమంతా సిద్ధం' సభ విజయవంతం : వైసిపి

ప్రజాశక్తి-మదనపల్లి

వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి కావడం ఖాయమని మదన పల్లిలో జరిగిన మేమంతా సిద్ధం బహిరంగ సభ విజయవంతం కావడమే ఇందుకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, బి.నరేష్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహ్మద్‌లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలు తీవ్ర ఎండను సైతం లెక్కచేయకుండా సిఎంకు కోసం ఎదురుచూసి బహిరంగ సభ పూర్తయ్యేంత వరకు ఉండి విజయవంతం చేశారని అన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రజలను మభ్య పెట్టేందుకు అమలుకు సాధ్యంకాని మ్యానిఫెస్టో ప్రజలకు ముందుకు వస్తున్నారని ప్రజలెవ్వరూ నమ్మే స్థితిలో లేరని అన్నారు. సభను విజయవంతం చేసిన వైసిపి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎపిఎండిసి చైర్ పర్సన్ జి.షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనుజకిరణ్‌రెడ్డి, వైస్ చైర్మన్‌లు జింకా వెంకట చలపతి, నూర్‌ఆజం, కౌన్సిలర్లు ఖాజా, కరీముల్లా, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి

రంజాన్ వేళలు



ఇఫ్తార్	షహరీ
గురువారం (సా)	శుక్రవారం (ఉ)
6.31	4.54

వాలంటీర్లను అడ్డుకోవడం దుర్మార్గపు చర్య :'ఆకేపాటి'

ప్రజాశక్తి-నందలూరు

పింఛన్లను పంపిణీ చేయకుండా వాలంటీర్లను తమ అనుబంధ సంస్థల ద్వారా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అడ్డుకోవడం దుర్మార్గపు చర్యాని రాజంపేట నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అవ్వాతాతలకు,విభిన్న ప్రతిభావంతులకు, వితంతువులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి నెల ఒకటో తారీఖున ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు ఇస్తుంటే దీనిని తన అనుబంధ సంస్థల ద్వారా ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకోవడం చంద్రబాబు పైశాచిక ఆనందానికి నిదర్శనమని అన్నారు. వాలంటీర్లు తమ పరిధిలో ఉన్న పేదలకు రెవెన్యూ, ఇంటి స్థలాలు, ప్రభుత్వ పథకాలు ఇంటి వద్దకే అందిస్తుంటే చూసి ఓర్వలేక వాలంటీర్లను అడ్డుకోవడంతో ఇంకా రెండు నెల పాటు పింఛన్ల కోసం పింఛన్దారులంతా ఇబ్బందులు పడవలసి వస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అవ్వాతాతలు, విభిన్న ప్రతి భావంతులు, వితంతువులకు ఒకటో తారీకు అంత తెల్లవారక ముందే పింఛన్ అందించాలన్న సదుద్దేశంతో వాలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి వారి కళ్ళల్లో ఆనందం చూశారని అన్నారు. చంద్రబాబు కుట్రపూరిత ఆలోచనతో నిమ్మగడ్డ ప్రసాద్ ద్వారా ఇసికి ఫిర్యాదులు చేయించి వాలంటీర్లను అడ్డుకున్నారని అన్నారు. ప్రజలందరికీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే సంక్షేమ పథకాలు రావేమోనని, పింఛన్లు రావని భయాందోళన మొదలైందని ఎవరు ఎటువంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని అన్నారు. రెండు నెలలు మాత్రమే ఇబ్బందులని, తిరిగి కచ్చితంగా రాబోయేది వైసిపి ప్రభుత్వమేనని, మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి అవుతారని అన్నారు. ప్రతి ఒక్కరికి ఒకటో తేదీన పింఛన్‌లు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అరిగెల సౌమిత్రి చంద్రనాథ్, అరిగే మనీ, ఉప సర్పంచ్ ఇబ్బు, అరిగే హరిబాబు, మహబూబ్ బాషా ఆనాల మధు యాదవ్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యంతో 11కెవి విద్యుత్ తీగలు తగిలి 9 సంవత్సరాల వికలాంగ బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండల పరిధిలోని కొల్లవారిపల్లె పంచాయతీ గోపమాంబాపురం అంబేద్కర్ కాలనీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గోపమాంబాపురం అంబేద్కర్ కాలనీకి చెందిన మద్దెల శంకరయ్య కుమారుడు విజయబాబు బుధవారం ఉదయం మూత్ర విసర్జనకు రాగా 11కెవి విద్యుత్ తీగలు తెగి పక్కనున్న ఆటోపై పడి బాలుడికి తగలడంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన బాలుడిని హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా బాధితుడి బంధువులు మాట్లాడుతూ చాలా కాలం నుంచి తమ గ్రామంలో విద్యుత్ వైర్లతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. పలుమార్లు 11 కెవి విద్యుత్ తీగలు తెగిపడి వాహనాలతో పాటు మనుషులు కూడా ప్రమా దాలకు గురయ్యారని అన్నారు. సమస్యను పరిష్కరించమని పలుమార్లు డివిజన్ విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరిగి అలసిపోయామని ఆవేదన చెందారు. 11కెవి విద్యుత్ తీగలు తమ ఇంటికి రెండు మీటర్ల ఎత్తులోనే ఏర్పాటు చేశారని, అది ఎప్పటికైనా అనుకోని ప్రమాదాన్ని తీసుకు రావచ్చని పేర్కొన్నారు. పలు దఫాలు అధికారులను, రాజకీయ నాయకులను కలిసి విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని అన్నా రు. విద్యుత్తు తీగల కారణంగా ఎవరో ఒకరు బలికాకముందే సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రమాదఘటన తెలియగానే వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శించి తక్షణసాయంగా కొంత ఆర్థిక సాయం అందించారు. ఈ ఘటనకు సంబంధించి విద్యుత్‌శాఖ రూరల్ ఎఇని వివరణ కోరేందుకు చరవాణి ద్వారా ప్రయత్నించగా నెట్ వర్క్ పరిధిలో లేకపోవడం వలన అందుబాటులోకి రాలేదన్నారు.


విద్యుత్ ప్రమాదంలో గాయపడిన బాలుడు విజయ్‌బాబు

గడ్డి వాహనం దహనం

రామసముద్రం : మండలంలోని ఓ రైతు పశు పోషణకు తరలిస్తున్న వరిగడ్డి వాహనం కాలి బూడిదైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. రామసముద్రం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాళహస్తి నుంచి చోక్కాండ్లపల్లి గ్రామానికి గడ్డి తరలిస్తున్న తరుణంలో పురాండ్లపల్లి వద్ద విద్యుత్ తీగలు తగిలి ఐచర్ వాహనానికి నిప్పంటుకుందని చెప్పారు. గ్రామంలో వాహనానికి నిప్పు అంటుకోవడంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి గ్రామానికి సమీపంలోని చెరువు ప్రాంతంలో నిలిపి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారని చెప్పారు. పుంగనూరు నుంచి ఫైర్ ఇంజిన్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


మంటల్లో కాలిపోతున్న వరిగడ్డి వాహనం

ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలి : ఆర్‌డిఒ


ఆదర్శ పోలింగ్ స్టేషన్లు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ మోహన్‌రావు

ప్రజాశక్తి-నందలూరు

రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలని రాజంపేట ఆర్‌డిఒ మోహన్ రావు రెవెన్యూ సిబ్బందికి సూచించారు. నందలూరులో ఏర్పాటుచేసిన ఆదర్శ పోలింగ్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే తమ లక్ష్యమని అన్నారు. వృద్ధులు, వికలాంగులు, గర్భిణుల కోసం ప్రత్యేక శ్రద్ధ వహించి వెయిటింగ్ రూమ్స్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఓటర్ల కోసం షామియానా, నీరు, ఇతర సదుపాయాలు కలిగించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో తాసిల్దార్ మహబూబ్‌బాషా, స్వీప్ మోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు, డిప్యూటీ తహశీల్దార్ జ్యోతి, సర్వేయర్ ఓబయ్య, వీఆర్వోలు చంద్రశేఖర్‌రాజు, గంగాధర్, వెంకటరమణ, శివప్రసాద్, లక్ష్మయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఎపిని అగ్రగామిగా నిలపడమే లక్ష్యం :'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర ప్రజలు ఇచ్చిన ఒక్క అవకాశంతో ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల కుప్పగా మార్చి వ్యవస్థలు కూల్చివేత, అవినీతిలో కోరుకు పోయిన రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే టిడిపి, బిజెపి, జనసేన కూటమి లక్ష్యమని పీలేరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పీలేరు పట్టణం కోటపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో వైసిపి నాయకులు మాజీ ఎమ్మెల్లే జివి.శ్రీనాథరెడ్డి ప్రధాన అనుచరుడు, ఎఎంసి డైరెక్టర్ గుట్టం నరేష్, రామ్‌కుమార్‌రెడ్డి, కిషోం కుమార్‌రెడ్డి సమక్షంలో తన అనుచరులతో టిడిపిలో చేరారు. కిషోర్ కుమార్ రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి ఒక్క సారి ఓట్లు వేసి గెలిపించిన పాపానికి రాష్ట్ర అభివృద్ధిని తుంగలో తొక్కి ప్రజలకు భవిషత్తు లేకుండా చేశారని అన్నారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకొంటున్నారని, ఆ మార్పుతోనే రాష్ట్రభవిషత్తు మారబో తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అన్ని రకాలుగా సంక్షేమాలు అందించి, అదుకోవడమే తమ కూటమి లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కిషోర్ కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

పీలేరులో కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి-పీలేరు

ప్రజలందరూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని పీలేరు సిఐ మోహన్‌రెడ్డి అన్నారు. బుధ వారం ఆయన మండలంలోని బాలంవారిపల్లి, నూనేవాండ్లపల్లి గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు, పోలీసు సిబ్బందిచే కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో ప్రజలకు శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగ కుండా ప్రశాంత వాతా వరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ ముందస్తు జాగ్రత్తలు తీసు కుంటున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ నరసింహుడు, ఎఎస్ఐ హేమసుందరం, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.


బాలవారిపల్లెలో కేంద్రబలకాల కవాతు

ఎంపీ పోటీ నుంచి అవినాష్ తప్పుకోవాలి : మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - కడప అర్బన్

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యా నేరం ఎదుర్కొంటూ, ఎంపీగా పోటీ చేస్తున్న వైఎస్.అవినాష్‌రెడ్డికి ప్రజాస్వామ్యం, ప్రజలపై నమ్మకం ఉంటే, పోటీ నుంచి తప్పుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల అసెంబ్లీ టిడిపి అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బిటెక్ రవి) డిమాండ్ చేశారు. ద్వారకానగర్‌లో ఉన్న శ్రీనివాసరెడ్డి నివాసంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందరెడ్డి ఎంపీ సీటు మనకే ఉండాలని జగన్‌కు చెబితే, షర్మిల ఒప్పుకుంటే అభ్యంతరం లేదని చెప్పడంతో వివేకా రెండు గంటలు షర్మిలతో మాట్లాడి ఒప్పించారని తెలిపారు. ఎంపీ సీటు కోసం వివేకాను చంపితే తప్ప కుదరదనే హత్య చేశారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా షర్మిల కాంగ్రెస్ పార్టీ నుంచి కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తుంటే, వైఎస్ఆర్ కొడుకుగా జగన్మోహన్‌రెడ్డి వైఎస్ఆర్‌కు ఎంతో ఇష్టమైన తమ్ముడు వివేకా హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాష్‌ను, చెల్లి షర్మిలపై పోటీకి దింపడం వైఎస్ ఆత్మ శోభించడానికా, శాంతించడానికి అని ప్రశ్నించారు. ఎంపీ సీటు మనకే ఉండాలని వివేకా జగన్‌కు చెబితే, షర్మిల ఒప్పుకుంటే అభ్యంతరం లేదని జగన్ చెప్పడంతో రెండు గంటలు షర్మిలతో మాట్లాడి ఆమెను ఒప్పించడంతో, ఇక ఎంపీ సీటు వివేకాను చంపితే తప్ప కుదరదనే హత్య చేశారని పేర్కొన్నారు. కడపలో ఎంపీ అభ్యర్థిగా వివేకాను హత్య చేసిన వాళ్లకే సీటు ఇచ్చారని షర్మిల స్పష్టంగా చెప్పారన్నారు. తాత, తండ్రి రక్తం జగన్‌లో ప్రవహిస్తూ ఉంటే, సొంత చిన్నాన్న హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని, సొంత చెల్లిపై పోటీకి ఎలా నిలబెడతావని నిలదీశారు. వైఎస్ విజయమ్మ కూతురు షర్మిల వైపా, మరిదిని చంపిన వారి వైపా పులివెందుల ప్రజలకు చెప్పాలన్నారు. హత్యా రాజకీయాలను జగన్ ప్రోత్సహిస్తున్నారని ఆయన చెల్లెళ్ల నోటి వెంట వస్తున్నాయని అన్నారు. వివేకా హత్య ప్రభావం ఎన్నికల్లో ఎక్కువగా ఉంటుందని, షర్మిల బాగా ప్రచారం చేస్తే, టిడిపి గెలుపు సులభతరం అవుతుందని, వైసిపి ఓట్లు చీలుతాయని ఒక ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.


భూ వనరుల వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

భూ వనరులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కలకడ

భూ వనరులను సక్రమంగా వినియోగించుకోవాలని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెడల్ చంగల్రాయుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పాఠశాలలో సేవ్ ఎర్త్-సేవ్ ఎనర్జీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ భూమి మీద ఉన్న వనరులను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యుత్ ఎక్కువగా చెట్లను పెంచాలని, విద్యుత్ వినియోగంలో ఆదా పద్ధతులను పాటించాలని అన్నారు. ఇళ్లలో ఎల్ఇడి బల్బులు వినియోగించాలని సూచించారు. సేవ్ ఎనర్జీ సేవ్ ఎర్త్ లో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, ఎస్సే రైటింగ్ నిర్వహించి బహుమతులను అందించారు. గ్రామంలో పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు, చెట్లు నాటుదాం భూమిని కాపాడుదాం, భావితరాల కోసం కరెంటు ఆదా చేద్దాం నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివారెడ్డి నాగమని నాయక్ సైరాబాను, షౌకత్అలీ, నౌషాద్ బేగం, కిరణ్, శ్రీదేవి, రూప్స్ లక్ష్మి పాల్గొన్నారు.

తేజోమయికి 'నాట్యరవళి' అవార్డు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

స్థానిక పట్టణంలో సిల్వర్ బెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో చదువుతున్న కొండూరు తేజోమయి నృత్య ప్రదర్శనలో ప్రతిభ చాటి నాట్య రవళి అవార్డు ప్రశంసా పత్రాన్ని అందుకుందని పాఠశాల కరస్పాండెంట్ ఎం.వి. కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాదులోని శ్రీవాగ్దేవి నాట్య సంగీత కళ నృత్య సంస్థ వారు మార్చి 31న శ్రీసర్వగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన పోటీ లను నిర్వహించారని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొన్న తేజోమయి అత్యుత్తమ నృత్య ప్రదర్శనను ప్రదర్శించి అవార్డును సొంతం చేసుకోవడం అభినందనీయమన్నారు. తేజో మయి ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ రాజేశ్వరి అభినందించారు.


తేజోమయిని అభినందిస్తున్న కరస్పాండెంట్

నేడు ప్రొద్దుటూరులో భువనేశ్వరి పర్యటన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భార్య నారా భువనేశ్వరి గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు మండలంలోని పెద్ద శెట్టిపల్లె గ్రామానికి రానున్నట్లు టిడిపి మండల కన్వీనర్ బాబులరెడ్డి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అక్రమంగా చంద్రబాబుపై కేసు బనాయించి జైలుకు పంపించారని తెలిపారు. ఈ విషయం తెలుసుకుని పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన ఒకటవ వార్డు మెంబర్ కూరపాటి రాధ గుండెపోటుతో మృతి చెందిందన్నారు. విషయం తెలుసుకున్న చంద్రబాబు రాధ కుటుంబానికి ఇప్పటికే ఆర్థికసాయం కూడా అందించారన్నారు. నారా భువనేశ్వరి రాధ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చనున్నట్లు వివరించారు. కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

రైతుకు 'పుట్టా' ఆర్థిక సాయం

ఖాజీపేట: మండల పరిధిలోని బి.కొత్తపల్లె గ్రామంలో ఇటీవల టిడిపి నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం సందర్భంగా ప్రమాదవశాత్తు సంభవించిన అగ్ని ప్రమాదంలో బి.వెంకటసుబ్బారెడ్డికి చెందిన వరి గడ్డివామి అగ్నికి కాలిపోయింది. రైతు తీవ్రంగా నష్టపోవడంతో స్పందించిన టిడిపి మైదుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ రూ.80 వేలు ఆర్థికసాయం చేశారు. ఈ మొత్తాన్ని బుధవారం టిడిపి మండలశాఖ అధ్యక్షులు స్థానిక నాయకుల చేతుల మీదుగా బాధిత రైతుకు అందజేశారు. కార్యక్రమంలో తవ్వా సుదర్శన్‌రెడ్డి, తవ్వాసుబ్బారెడ్డి, కృష్ణ యాదవ్, కృష్ణయ్య, రఘురామిరెడ్డి, సుబ్బారెడ్డి, పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి : భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి-చాపాడు: రాబోయే ఎన్నికల్లో టిడిపి గెలుపునకు ప్రజలు సహకరిస్తే జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని టిడిపి ఎంపీ అభ్యర్థి సి.హెచ్.భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అల్లాడుపల్లె గ్రామానికి చెందిన ఎంపిటిసి ఎంపి పేరుగు నారాయణ యాదవ్, యర్రమాచ వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు పుట్టా సుధాకర్ యాదవ్, ఎంపీ అభ్యర్థి సి.హెచ్.భూపేష్ రెడ్డి సమక్షంలో వైసిపి నుంచి టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ టిడిపికి ఆదరణ పెరుగుతోందన్నారు. శాసనసభ ఎన్నికల్లో గెలవగానే మైదుకూరు నియోజకవర్గంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మల్లేశ్వర్, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు, టిడిపి మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి డి.గురివిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి, వేమారెడ్డి, మాజీ జడ్‌పిటిసి మేకల బాబు పాల్గొన్నారు.

చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కలసపాడు : మండలంలోని అన్ని సచివాలయ కేంద్రాల వద్ద వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపిడిఒ కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ సెక్రెటరీ, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందువలన వాలంటీర్లు ఎక్కడ కూడా విధులకు హాజరు కాకూడదని, రేషన్ షాప్‌ల వద్ద కూడా ఉండకూడదని పేర్కొన్నారు. వాలంటీర్లకు ఇచ్చిన, మొబైల్ ఫోన్, తంబింగ్ మిషన్, వెంటనే సచివాలయ కేంద్రానికి అందించాలని పేర్కొన్నారు. వృద్ధాప్య పెన్షన్ పంపిణీ విధానంలో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు జాగ్రత్త వహించి ప్రతి ఒక్కరికి పెన్షన్ అదే విధంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మురారి పాల్గొన్నారు.


వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-నందలూరు

కడప-చెన్నై జాతీయ ప్రధాన రహదారిలోని మూసివేసిన ఆల్విన్ కర్మాగార సమీపంలో ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రాముడు, పోలీసులు మహేంద్ర, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో 'దాసిరిపల్లి'

ప్రజాశక్తి-ములకలచెరువు

త్వరలో జరిగే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్య మంత్రి చేసుకోవాలని తంబ ళ్లపల్లె టిడిపి అభ్యర్థి దాసిరిపల్లి జయ చంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధ వారం కురబలకోట మండలం, అంగళ్లలో జరిగిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇంటిం టికి తిరిగి టిడిపి ముద్రించిన కరపత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజక నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. ప్రత్యేక శ్రద్ధ చూపి నియోజ కవర్గంలో పరిశ్రమల ఏర్పాటు చేసే వలసలను నివారిస్తానని చెప్పారు. అంగళ్ల పట్టణంలో ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆటో యూనియన్ నాయకులతో చర్చించి ఆటో స్టాండ్ వద్దనే అన్న క్యాంటీన్‌ని కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమానికి టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, పాల్గొన్నారు.


సైకిల్‌పై ప్రచారం చేస్తున్న జయచంద్రారెడ్డి

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందిస్తాం

ప్రజాశక్తి - వేంపల్లె

నేటి ప్రపంచానికి రసాయన కలుషితాలు లేని నాణ్యమైన ఎరువులు, విత్తనాలతోపాటు పురుగు మందులు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వేద ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఇ.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గురు వారం వేంపల్లి పట్టణంలో రిజిస్టర్ ఆఫీస్ ఎదురుగా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ బ్రాంచ్ ప్రారంభోత్సవం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థిక నష్టాలు ఊబి నుండి బయటపడి, ప్రతి రైతు వ్యాపారస్తునిగా మారడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. దేశీయ, విదేశీ కంపెనీలతో సత్సంబంధాలు పెట్టుకుని వ్యవసాయ ఉత్ప త్తులను మార్కెటింగ్ చేయనున్నట్లు తెలిపారు. ఆధునిక ప్రపం చంతో పోటీపడి తమ ఉనికిని ప్రపంచానికి చాటి చెప్పడానికి అత్యాధునిక వ్యవసాయ పరిజ్ఞానం సొంతం చేసుకోవడానికి ఈ కంపెనీ ఉత్పత్తులు ఎంతో ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజశేఖర్‌రెడ్డి కోరారు.

ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

రానున్న ఎన్నికల్లో ఓటరు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో నిర్భయంగా వేసుకోవచ్చని డిఎస్పీ యశ్వంత్ అన్నారు. మండలంలోని సమస్యాత్మకమైన ఉప్పలూరు, కొర్రపాడు, చింతకుంట, రాజుల గురువాయపల్లె, యామవరం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎస్ఐ మైనుద్దీన్‌తో కలిసి డిఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సమస్యాత్మక ప్రాంత పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలు, పోలీసులతో ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు, నాయకులు సహకరించాలని కోరారు. అల్లర్లకు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పైడిపాలెంలో వైసిపి నాయకులు ప్రచారం

ప్రజాశక్తి- సింహాద్రిపురం

పైడిపాలెం గ్రామంలో వైసిపి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుధవారం వైసిపి మండల ఎన్నికల పరిశీలకుడు వీరశివారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మండల నాయకులు బ్రహ్మానందరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ రామమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మళ్లీ రాజన్న రాజ్యం రావాలంటే ప్రతి ఓటరు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. **పులివెందుల రూరల్ :** మున్సిపాలిటీ పరిధిలో బుధవారం మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం చేపట్టిన పథ కాలు, వాటి వల్ల ప్రజలకు జరిగిన మంచిని వివరిం చారు. వైసిపికి ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపిం చాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హాఫీజుల్లా, సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్లు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి, డేనియల్ బాబు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జెండామాన్ వీధిలో రంజాన్ పండుగ సందర్భంగా గఫూర్ చారిటబుల్ ట్రస్ట్ వారు పేదలకు నిత్యవసర సరుకులు, చీరలు పంపిణీ చేశారు. వీటిని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ చేతుల మీదుగా 40 కుటుంబాలకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ముస్లిం నాయకుడు నూరుల్లాహ్ పేదలకు అందిస్తున్న సేవలు మరువలేనిన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా పేదవారి కుటుంబాల్లో సంతోషం ఉండాలని నిత్యవసర సరుకులు, చీరల పంపిణీ చేయడం, గతంలో కౌన్సిలర్‌గా ఉన్నప్పుడు తన సొంత ఖర్చులతో వార్డులో నీటి వసతి కోసం బోరు చేయించారని కొనియాడారు. కరోనా సమయంలో కూడా పేదల సేవా కార్యక్రమాల్లో తనవంతుగా సహాయం అందించడని ప్రశం సించారు. కార్యక్రమంలో రాష్ట్ర నూర్ భాషా సంఘం చైర్మన్ ఓతూరు రసూల్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫిజ్, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు హామద్, ఖలీల్, నూరు డొనాల్డ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

స్థల వివాదంలో ఘర్షణ

ఇద్దరికి గాయాలు - ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మండల పరిధిలోని గుణిగుంట్ల రహదారిలోఉన్న ఎస్‌పి బంగ్లా సమీపంలో బుధ వారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. వివరాలిలా ఉన్నాయి..సర్వే నెంబర్ 733/1 స్థల వివాదంపై కోర్టులో కేసు నడుస్తోంది. పల్లపు రామాంజనేయులు అనే వర్గం వారు కోర్టులో ఉన్న స్థలంలో గునాది కట్టడానికి ప్రయత్నిస్తుంటే సయ్యద్‌జాఫర్ ఈ స్థలం కోర్టులో ఉందని తెలపడంతో ఇరువురి మధ్య మాట మాట పెరిగి దాడికి దారితీసిందని తెలిపారు. రెండు వర్గాల మధ్య వివాదం నెలకొనడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని, రెండు వర్గాల్లోని వారు పరస్పరం రాళ్లు, కర్రలతో దాడులకు చేసుకున్నట్లు తెలుస్తుందన్నారు. ఈ దాడిలో ఇద్దరికీ గాయాల య్యాయని, గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించారని చెప్పారు. ఈఘటనపై ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని తెలిపారు.